ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- ఆటోలో అసెంబ్లీకి వెళ్లిన శాసన సభ్యురాలు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి9 : మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని, వారిని ఆదుకోవాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్లకార్డులు పట్టుకొని ఆటోలో అసెంబ్లీకి బయలుదేరి వెళ్లా రు. పార్టీ ఆదేశాల మేరకు ఆటో కార్మికులకు అండగా నిలుస్తామని, వారి పక్షాన పోరాటం చేస్తామని కోవలక్ష్మి తెలిపారు.

ప్లకార్డులతో ఆటోలో అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

పాహుండి కూపర్ లింగు స్వామి జాతర ప్రారంభం

కాసిపేట, ఫిబ్రవరి 9 : మండలంలోని వెంకటాపూర్ గ్రామ పంచాయతీలోని కుర్రేఘడ గ్రామంలో పాహుండి కూపర్ లింగు స్వామి జాతర శుక్రవారం అట్ట హాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతర కార్యక్ర మంలో భాగంగా మొదటి రోజు జెండా ఆవిష్కరణ చేసి, మూడు రకాల కుంకు మలతో పూజలు చేశారు. అనంతరం అగ్నిగుండం తవ్వి సంప్రదాయ పూజలు చేశారు. భజన కార్యక్రమం చేపట్టారు. 10న అగ్నిగుండం, మాల విరమణ, దర్బార్, పెద్ద పూజ, 11న ముగింపు కార్యక్రమం ఉంటుందని జాతర నిర్వాహకులు తెలిపారు.

అగ్నిగుండం వద్ద పూజలు చేస్తున్న ఆదివాసులు

తిర్యాణి రేంజ్ పరిధిలో నరికి వేతకు గురైన టేకు వృక్షాలు (ఫైల్)

అటవీశాఖలో ఇంటి దొంగలు

స్మగ్లర్లతో కుమ్మక్కై అక్రమంగా కలప రవాణా

- ఆయా రేంజ్‌లలో ఎటు చూసినా నరికేసిన మొదల్లే..
- గుట్టు తేల్చేందుకు రంగంలోకి దిగిన ఉన్నతాధికారులు
- బీట్‌ల వారీగా ఆకస్మిక తనిఖీలు.. కార్డన్ సెర్చ్‌లు
- కలప కోసే నాలుగు భారీ యంత్రాలు స్వాధీనం

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ తిర్యాణి/లింగాపూర్, ఫిబ్రవరి 9 : దట్టమైన అడ వుల జిల్లాగా పేరుగాంచిన జిల్లా అటవీశాఖలో ఇంటి దొంగలు పెట్రేగిపోతున్నారు. స్మగ్లర్లతో చేతులు కలిపి విలువైన కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. అడవుల్లో నేల కొరిగిన టేకు వృక్షాల మొదల్లే అధికారుల అవినీతికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. జోడేఘాట్ అటవీ రేంజ్ పరిధిలో తరచుగా కలప పట్టుబడుతుండగా, విచారణ చేప ట్టిన అటవీ శాఖ ఉన్నతాధికారులు విస్తుపోయే నిజాలను గుర్తించారు. క్షేత్ర స్థాయిలో అడవులను పర్యవేక్షించి రక్షించాల్సిన అధికారులే కంచె చేను మేసిన చందంగా.. స్మగ్లర్లతో చేతులు కలిపి అడ వుల నరికివేతకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. బాధ్యులను సస్పెండ్ చేయడంతో పాటు అడవుల నరికివేతకు పాల్పడుతున్నట్లుగా అనుమానిస్తున్న గ్రామాల్లో ఆకస్మికంగా కార్డన్ సెర్చ్‌లు నిర్వహిస్తు న్నారు. గురువారం జోడేఘాట్ రేంజ్ పరిధిలోని బాండేయేర్, పెద్ద దోభ, పిక్లతాండా, వంజరిగూడ గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి రూ. 2 లక్షల విలువ చేసే కలపతో పాటు కలప కోసే నాలుగు భారీ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

దట్టమైన అటవీ ప్రాంతాల్లో నరికివేత

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా విస్తీర్ణంలో 54 శాతం అడవులే ఉన్నాయి. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం టైగర్ జోన్‌గా గుర్తించింది. అడవుల్లోకి వెళ్లకుండా ఆంక్షలు విధించింది. అడవులను కాపా డాల్సిన అధికారులే స్మగ్లర్లతో చేతులు కలిపి అడ వుల నరికివేతకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆసిఫాబాద్ అటవీ డివిజన్ లోని దట్టమైన అటవీ ప్రాంతాలు కలిగిన గిన్నెధరి, కెరమెరి, జోడేఘాట్, తిర్యాణి అటవీ రేంజ్‌ల పరి ధిలో సుమారు లక్షా 10 వేలకు పైగా హెక్టార్ల అటవీ ప్రాంతం ఉంది. ఈ ప్రాంత మొత్తం దాదాపు విలు వైన టేకు వనాలతోనే నిండి ఉంది. జోడేఘాట్ అటవీరేంజ్ పరిధిలోని బాండేయేర్, పెద్దదోభ, పిక్ల తాండ, గీతబండ, చింతగూడ గ్రామాల నుంచి నిర్మల్ జిల్లా పరిధిలోనికి వచ్చే ఉడుంపూర్ అటవీ రేంజ్‌లోకి, నిర్మల్ పరిధిలోకి వచ్చే ఇందన్‌పల్లి రేంజ్‌లోకి అటవీ మార్గం గుండా దారులు ఉన్నాయి. ఉడుంపూర్ రేంజ్‌లోని ఇస్లాంపూర్ దట్ట మైన అటవీ ప్రాంతంలో ఉంది. లింగాపూర్ మండలం గీతబండా, కొత్తపల్లి గ్రామాల నుంచి ఉడుంపూర్ రేంజ్ పరిధిలోని ఇస్లాంపూర్ వరకు అడవులను నరుకుతున్నట్లు తెలుస్తున్నది.

ఎటుచూసినా నరికిన మొదల్లే..

కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోకి వచ్చే ఈ అడవు ల్లోకి మనుషులు వెళ్లడాన్ని నిషేధించటంతో స్మగ్లర్ల ఆగడాలకు అడుపులేకుండా పోతున్నది. క్షేత్రస్థా యిలో అడవులను నిరంతరం రక్షించే అటవీ అధి కారులే స్మగ్లర్లతో చేతులు కలపడంతో టేకు చెట్ల నరి కివేత విచ్చల విడిగా సాగుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. గిన్నెధరి, జోడేఘాట్, తిర్యాణి అటవీ రేంజ్‌ల పరిధిలోని అడవుల్లో ఎటుచూసినా నరికి వేసిన టేకు చెట్ల మొదల్లే దర్శమిస్తున్నాయి. దట్ట మైన అటవీ ప్రాంతాలు నాణ్యమైన టేకు వనాలు కలిగిన మొర్రిగూడ, మంగి, కౌటాగాం, గేసిగూడ, ఎర్రబండ, రోంపల్లి అటవీ ప్రాంతాల్లో కూడా విలు వైన టేకు వనాలు నరికివేతకు గురవుతున్నాయి. గిన్నెధరి, కెరమెరి, జోడేఘాట్, తిర్యాణి రేంజ్ పరి ధిలో దాదాపు 110 అటవీ బీట్‌లు ఉన్నాయి. వీటి పరిధిలోని అటవీ ప్రాంతాల్లో అటవీ శాఖ ఉన్నతా ధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే అటవీ అధికారుల దురాగతాలు మరిన్ని బయటపడే అవ కాశాలున్నాయి.

కార్డన్‌సెర్చ్‌లలో నాలుగు యంత్రాలు స్వాధీనం

జోడేఘాట్ రేంజ్ పరిధిలోని బాండేయేర్, పెద్ద దోభ, పిక్లతండా, వంజరిగూడలో గురువారం అటవీ అధికారులు చేపట్టిన కార్డన్ సెర్చ్‌లలో కలప కోసే నాలుగు భారీ యంత్రాలను అటవీ అధికా రులు గుర్తించడాన్ని గమనిస్తే చెట్ల నరికివేత, కలప రవాణా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకో వచ్చు. ఇదంతా క్షేత్రస్థాయిలో పనిచేసే అటవీ అధి కారుల సహకారంతోనే జరుతోందని అర్థమవు తోంది. తనిఖీలకు వచ్చిన అటవీ అధికారులను అడ్డుకునే ప్రయత్నాలను కూడా ఆయా గ్రామాల ప్రజలు చేసినట్లు తెలుస్తోంది. స్మగ్లర్ల ఆగడాలను అరికట్టాలంటే అటవీ శాఖ ఉన్నతాధికారులు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బోర్డు ఎత్తేసిన కనకదుర్గ..!

కోట్ల రూపాయలు వసూలు చేసిన చిట్‌ఫండ్

- ఏజెంట్‌గా వ్యవహరించిన ఏడీఏ భార్య
- ఏడీఏ సార్ చెప్తేనే చిట్టీలు వేసిన ఫర్టిలైజర్స్ యాజమానులు
- తీరా డబ్బులు రావని తెలిసి గగ్గోలు
- 'నమస్తే తెలంగాణ'ను సంప్రదించిన బాధితులు

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కనకదుర్గ చిట్‌ఫండ్ కార్యాలయం

మంచిర్యాల, ఫిబ్రవరి 9(నమస్తే తెలం గాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రం లోని కనకదుర్గ చిట్‌ఫండ్ బోర్డు తిప్పేసి నట్లు తెలిసింది. ఆ చిట్‌ఫండ్ కార్యాలయం ఉన్న బిల్డింగ్‌కు టులెట్ బోర్డు సైతం పెట్టిన నిర్వాహకులు.. అసలు కార్యాలయం ఉం చుతున్నారా.. తీసేస్తున్నారా.. అనే విష యంపై స్పష్టత లేదు. అసలు ఎన్ని చిట్ గ్రూపులు వేశారు.. ఎన్ని గ్రూప్‌లు క్లోజ్ అ య్యాయి.. ఎంత మందికి పేమెంట్ చేశా రు.. ఇంకా ఎంత మందికి ఇవ్వాల్సి ఉంది.. ఈ వివరాలేవీ చెప్పడానికి చిట్‌ఫండ్ కార్యా లయ సిబ్బంది ఇష్టపడడం లేదు. ఏం అడి గినా జిల్లా చిట్ రిజిస్ట్రార్ దగ్గర తీసుకోండి.. అసలు మీరెవరు మమ్ముల అడుగడా నికి, అయినా మాకు ఈ సంస్థకు సంబంధం లేదు. మాకే జీతాలు ఇవ్వడం లేదంటూ.. చర్చ జరుగుతున్నంత సేపు తలాతోక లేకుండా సమాధానాలు చెప్తూ విషయాన్ని దాటవేసే ప్రయత్నం చేశారు. అసలు చిట్ ఫండ్ అనేది పబ్లిక్ డబ్బులతో నడిచే సంస్థ. చిట్టీ నడిపినందుకు కొంత కమీషన్ తీసు కొని పని చేయాలి. చిట్టి వేసిన వారు, చిట్టి వేసిన వారి తరపున వెళ్లి అడిగే వారు, అంతెందుకు కామన్ పీపుల్ వెళ్లి అడిగినా దాని లావాదేవీలకు సంబంధించిన వివ రాలు చెప్పాలి. కానీ ఇందుకు విరుద్ధంగా సదరు చిట్‌ఫండ్ సిబ్బంది వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఈ చిట్‌ఫండ్‌లో రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు చిట్టీలు వేసిన బాధితులు కొందరు 'నమస్తే తెలంగాణ'కు ఫోన్ చేసి విషయం చెప్పారు. చిట్టీ కోసమని తాము కోట్లాది రూపాయాలు కట్టామని, తీరా ఇప్పుడు మేము కట్టిన పైసలు కూడా ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదని వాపోయారు.

'నమస్తే'నే ఎందుకు సంప్రదించారు..

నెల రోజులుగా జిల్యా వ్యవసాయశా ఖలో జరుగుతున్న అక్రమాలు, యూరియా ఇండెంట్ మార్పి ఎరువులు, ఫర్టిలైజర్ షాపులు ఇచ్చే మామూళ్లకు రుచి మరిగి అధికారులు పాల్పడిన అక్రమాలకు 'న మస్తే తెలంగాణ' కథనాలు అద్దం పట్టాయి. వరుస కథనాలు ప్రచురించడంతో అధికార యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జిల్లా వ్యవసాయశాఖపై ప్రత్యేకాధికారితో ఎంక్వైరీ చేయించిన కలెక్టర్ బదావత్ సంతోష్ ఆ నివేదికను వ్యవసాయశాఖ కమి షనర్‌కు పంపించారు. దాదాపు పత్రిక ప్రచురించిన ప్రతి విషయం నిజమేనని అధి కారులు ఎంక్వైరీలో గుర్తించినట్లు విశ్వసనీ యంగా తెలిసింది. ఈ వ్యవహారంపై బాధ్యులపై త్వరలోనే చర్యలు తీసుకుంటా రని తెలుస్తుంది. ఇది నాణేనికి ఒకవైపు కాగా.. చెన్నూర్ వ్యవసాయ డివిజన్‌లో భా రీగా జరిగిన అవకతవకలపై కథనం ప్రచురి తమైన రోజు.. కొందరు ఫర్టిలైజర్ షాపు యాజమానులను సంప్రదించారు. చెన్నూర్ ఏడీఏ సార్ చెప్పడంతో తాము కనకదుర్గ చిట్‌ఫండ్‌లో చిట్టీలు వేశామని, రెండేళ్లు, రెండున్నరేండ్లు క్రమం తప్పకుండా ప్రతి నెలా చిట్టీ కట్టామని, ఇప్పుడేమో చిట్‌ఫండ్ ఎత్తేస్తున్నట్లు తెలిసిందని, కనీసం మా డబ్బులు మాకు రిటర్న్ ఇవ్వండని అడిగినా తిప్పించుకుంటున్నారని తమగోడును వెల బోసుకున్నారు. అసలు చెన్నూర్ వ్యవ సాయ శాఖ ఏడీఏ సార్‌కు ఈ చిట్‌ఫండ్‌కు సంబంధం ఏందబ్బా అని ఎంక్వైరీ చేయగా.. ఆ సారు భార్య ఈ చిట్‌ఫండ్‌లో ఏజెంట్‌గా ఉన్నట్లు తెలిసింది. చిట్టీలు వేయి స్తే లక్షలాది రూపాయల కమీషన్ వస్తుందని కక్కుర్తి పడిన ఆ మేడం సార్‌ను ఫోర్స్ చేశా రంటా.. దానితో ఆయన మన లావాదేవీలు యూరియా, ఎరువుల కేటాయింపు ఇలాగే కొనసాగాలంటే మీరు చిట్టీలు వేయా లంటూ పట్టుబడ్డారంట.. దీంతో చేసేదేమీ లేక కనకదుర్గ చిట్‌ఫండ్స్‌లో చిట్టీలు వేసి నట్లు బాధితులు చెప్పారు. ఇదేసారు చెప్ప డంతో వ్యవసాయశాఖలో వివిధ హోదాల్లో పనిచేసే ఉద్యోగులు సైతం చిట్టీలు వేసినట్లు తెలిసింది. ఈ విషయంపై చెన్నూర్ ఏడీఏ బాపును వివరణ కోరగా.. మాది మధ్య తర గతి కుటుంబమని, ఇద్దరం పనిచేస్తే బాగుం టుందనే ఉద్దేశంతో నా భార్య ఏజెంట్‌గా చేరిందన్నారు. ఫర్టిలైజర్ షాపుల యాజమా నులు, మా శాఖకు సంబంధించిన ఉద్యో గులు ఎవ్వరినీ నేను ఇబ్బంది పెట్టలేద న్నారు. మా మేడం ఏజెంట్ కావడంతో అందరినీ అడిగినట్లే వారిని అడగ్గా చిట్టీలు వేశారని చెప్పారు.

కోట్ల రూపాయలకు ఎగనామం..

మొత్తంగా ఈ చిట్ ఫండ్ వ్యవహారంలో 10కి పైగా చిట్టీ గ్రూప్‌లు ప్రస్తుతం యాక్టి వ్‌గా ఉన్నట్లు సమాచారం. ఈ గ్రూప్‌లన్నీ కూడా రూ.10లక్షలపైనే ఉన్నట్లు తెలిసింది. ఆ లెక్కల ప్రకారం చూసుకుంటే కొన్ని కోట్ల రూపాయలకు ఎగనామం పెట్టేందుకు సిద్ధ మైనట్లు తెలుస్తుంది. ఇప్పటికే చిట్టీలు ఎత్తు కున్న వారి నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్న చిట్‌ఫండ్ సిబ్బంది.. చిట్టీలు కడుతున్నవారికి డబ్బులు తిరిగి ఇచ్చే విషయంలో మాత్రం నోరుమెదపడం లేదు. గట్టిగా నిలదీస్తే సంస్థకు చెందిన ప్లాట్లు ఉన్నాయి. మీరు కట్టిన డబ్బులు ఇవ్వలేమని, ప్లాట్లు తీసుకోండని బలవం తంగా అంటగడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరకు కొన్న భూము లను రెట్టింపు చేసి అదనంగా డబ్బులు గుంజుతున్నారు. ఇక చేసేదేం లేక కట్టిన డబ్బులు తిరిగి వస్తాయో, రావోననే భయంతో చాలా మంది చిట్టీ కడుతున్న వారు అదనపు డబ్బులు చెల్లించి ప్లాట్లను తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకుంటు న్నట్లు తెలిసింది. ఈ విషయంపై చిట్‌ఫండ్ మేనేజర్ మహేందర్‌ని వివరణ కోరగా.. మేము సంస్థలో ఉద్యోగులమని, హెడ్ ఆఫీస్ వరంగల్‌లో ఉందని, రెండేళ్ల నుంచి చిట్టి పాటను నిలిపివేశామని చెప్పారు. కష్ట మర్లు కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడు గుతున్నా.. సంస్థ వారికి ఇచ్చే పరిస్థితి లేదని, పెట్టిన వెంచర్‌లో ప్లాట్లు కొనుక్కుం టేనే మంచిదంటూ ఉచిత సలహా ఇచ్చారు.

అధికారులే చొరవ తీసుకోవాలే..

''వ్యవసాయ శాఖలో అక్రమాలపై ఉన్న తాధికారులు ఎలాగైతే స్పందించారో.. ఈ విషయంలోనూ అట్లనే స్పందించాలి. మంచిర్యాలలో ఎన్నో చిట్‌ఫండ్స్ బోర్డు తిప్పేశాయి. జనం డబ్బుల కోసం ఆ కంపె నీల చుట్టూ తిరిగి గోసపడుతున్నారు. వ్యవ సాయ శాఖలో పని చేసే అధికారి చెప్పారనే మేము చిట్టీలు వేశాం. కష్టపడి సంపాదిం చిన లక్షలాది రూపాయలు అందులో కట్టాం. అవి తిరిగి వచ్చే పరిస్థితి లేదు. అధి కారులే చొరవ తీసుకొని మా డబ్బులు ఇప్పించాలే. నా పేరు చెప్తే నా వ్యాపారం దెబ్బతీస్తరు. నన్నే టార్గెట్ చేస్తరు. ఎలాగైనా ఈ విషయం మీ పేపర్‌లో వచ్చేటట్లు చూడండి.'' అని ఓ బాధితుడి తెలిపాడు.

తెలుగు తేజం..మన పీవీ

- సముచిత స్థానం కల్పించిన కేసీఆర్ సర్కారు
- భారతరత్న ప్రకటించడంపై సర్వత్రా హర్షం



మంచిర్యాల (నమస్తే తెలంగాణ ప్రతి నిధి)/చెన్నూర్, ఫిబ్రవరి 9 : భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావు భారత జాతి ఖ్యాతిని ప్రపంచదేశాలకు చాటిచె ప్పారు. రుక్మాబాయమ్మ, సీతారామారావు దంపతులకు 28.06.1921లో జన్మించా రు. ఈయన భార్య సత్తెమ్మ. వీరికి ముగ్గురు కొడుకులు, ఐదుగురు కూతుళ్లు. వరంగల్ జిల్లా వేలేరు మండల కేంద్రంలోని ప్రభు త్వ పాఠశాలలో విద్యాభ్యాసం మొదలు పెట్టారు. హన్మకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. కళాశాల చదువుకోసం ఉస్మానియా విశ్వవి ద్యాలయంలో చేరారు. అక్కడ వందేమా తరం ఆలపించడంతో సహచరులతోపాటు పీవీని విశ్వవిద్యాలయం నుంచి అప్పటి నిజాం ప్రభుత్వం బహిష్కరించింది. దీంతో మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఉన్నత విద్యా భ్యాసం కొనసాగించారు. బీఎస్సీ, ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరి అంచెలంచెలుగా అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడయ్యారు.

క్లిష్టసమయాల్లో బాధ్యతల స్వీకరణ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా క్లిష్టసమయాల్లో బాధ్యతలు స్వీక రించారు. ముల్కీనిబంధనలు చట్టవిరుద్ధ మని చెప్పిన సుప్రీంకోర్టు తీర్పును బహిరం గంగా స్వాగతించినందుకు అప్పటి సీమాంధ్రనేతలు కక్షగట్టారు. భూసంస్కరణల చట్టం అమలుకు ఏకంగా ఆర్డినెన్స్ తీసుకు రావడం తెలంగాణ–ఆంధ్రానేతలకు కంత గింపుగా మారింది. ఫలితంగా పీవీ ముఖ్య మంత్రిగా పదవీచ్యుతుడయ్యారు. ప్రధానిగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన భార తదేశాన్ని తన శక్తియుక్తులతో గట్టెక్కిం చారు. 1996లో ప్రధానమంత్రి పదవీ కాలం ముగిశాక పీవీ క్రియాశీల రాజకీయా లకు దూరంగా ఉన్నారు.

కేసీఆర్ సర్కారులో గుర్తింపు

పీవీ 2004 డిసెంబర్ 23న 83వ యేట మరణించారు. మరణానంతరం ఆయనను స్మరించుకోవడంలో కాంగ్రెస్ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. జయంతి, వర్ధంతి రోజుల్లో కూడా ఇదే వివక్ష చూ పారు. గల్లీ లీడర్లకు సైతం విగ్రహాలు పెట్టే నేతలు పీవీ విషయంలో మాత్రం స్పందిం చలేదు. కనీసం విగ్రహాలు కూడా ఆవిష్క రించుకోలేదు. కానీ, 2014లో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పీవీకి తగిన గుర్తింపునిచ్చింది. కేసీఆర్ ఆదేశాల మేరకు ఆయన జయంతి వేడుకలను ఏటా అధికా రికంగా నిర్వహిస్తూ వచ్చారు.

పీవీకి భారతరత్న ఇవ్వడంపై హర్షం

పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్నను ప్రకటించింది. తెలుగుబిడ్డ పీవీకి దేశంలోని అత్యున్నతమైన పురస్కా రం ప్రకటించడంపై ఉమ్మడి జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భారత ప్రధా నిగా తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటి చెప్పిన మహా మేధావి.. మన పీవీ అని కొనియాడుతున్నారు.

కేంద్రానికి కృతజ్ఞతలు

భారత మాజీ ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించినందుకు చాలా సంతో షంగా ఉంది. పీవీ భారత ప్రధానిగా అనేక సంస్కరణలు చేట్టారు. తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటి చెప్పిన మహా మేధావి. పీవీకి భారత రత్న ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృత జ్ఞతలు తెలుపుకుంటున్న. - బాల్కసుమన్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే

నస్పూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన సుర్మిల్ల వేణును సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సతీశ్

నస్పూర్ మున్సిపల్ చైర్మన్‌గా వేణు

- వైస్ చైర్మన్‌గా గెల్లు రజిత

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 9 : నస్పూర్ మున్సిపాలి టీలో పాలకవర్గ ఎన్నిక శుక్రవారం జడ్పీ సీఈవో కే నరేందర్ ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో మొత్తం 25 మంది కౌన్సిలర్లకుగాను 18 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఏడుగురు, కాంగ్రెస్ కౌన్సిలర్ ఒకరు గైర్హాజర య్యారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు హాజరయ్యారు. ఈ సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్ బొద్దున సంధ్యారాణి చైర్మన్‌గా సుర్మిల్ల వేణు పేరును ప్రతిపాదించగా, సీపతి సుమతి బలపరిచారు. వైస్ చైర్మన్‌గా గెల్లు రజిత పేరును కౌన్సిలర్ బండారి సంధ్యారాణి ప్రతిపాదిం చగా, సీపతి సుమతి బలపరిచారు. ఇంకా ఎవరూ పోటీకి రాక పోవడంతో కౌన్సిల్ ఆమోదం మేరకు నస్పూర్ మున్సిపల్ చైర్మన్‌గా సుర్మిల్ల వేణు(కాం గ్రెస్), వైస్ చైర్మన్‌గా గెల్లు రజిత ఏకగ్రీవంగా ఎన్ని కైనట్లు ఎన్నికల అధికారి, జడ్పీ సీఈవో కే నరేందర్ ప్రకటించారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి మంచి ర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు హాజరై చైర్మన్‌గా ఎన్నికైన సుర్మిల్ల వేణు, వైస్ చైర్మన్‌గా ఎన్నికై గెల్లు రజితలను సన్మానించారు.

విజయోత్సవ ర్యాలీ

అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయ కులు, కార్యకర్తలు నస్పూర్ మున్సిపల్ కార్యా లయం నుంచి సీసీసీ కార్నర్ వరకు పటాకులు కాల్చుతూ విజయోత్సవ ర్యాలీ తీశారు. అంబే ద్కర్, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సి లర్లు అగల్‌డూటి రాజు, మేకల దాసు, ఆర్ చంద్ర శేఖర్, కోడూరి లహరి, తెనుగు లావణ్య, బండి పద్మ, మల్లయ్య, మర్రి మొగిళి, బెడిక లక్ష్మి, మహేశ్, కుమార్, బౌతు లక్ష్మి, తోట శ్రీనివాస్, ఇన్‌చార్జి కమిషనర్ సతీష్ పాల్గొన్నారు.

మంచిర్యాల మున్సిపల్ చైర్మన్‌గా ఉప్పలయ్య

- వైస్‌చైర్మన్‌గా మహేశ్ ఏకగ్రీవం

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 9 : మంచిర్యాల మున్సిపల్ చైర్మన్‌గా రావుల ఉప్పలయ్య, వైస్‌చైర్మన్‌గా సల్ల మహేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్ర వారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంచిర్యాల ఆర్డీవో, అధీకృత అధికారి వాడాల రాములు ఆధ్వర్యంలో నూతన చైర్మన్, వైస్‌చైర్మన్‌ల ఎన్నిక నిర్వ హించారు. మంచిర్యాల మున్సిపాలిటీలో మొత్తం 36 మంది కౌన్సిలర్లుం డగా, కోరం కోసం 18 మంది కౌన్సిలర్లు హాజరు తప్పనిసరి కాగా, 26 మంది సభ్యులు వచ్చారు. చైర్మన్‌గా రావుల ఉప్పలయ్య పేరును 13వ వార్డు కౌన్సి లర్ నల్ల శంకర్ ప్రతిపాదించగా, మూడోవార్డు కౌన్సిలర్ మాజిద్ బలపరి చారు. దీనికి కౌన్సిలర్లంతా ఆమోదం పలికారు. వైస్‌చైర్మన్‌గా సల్ల మహేశ్ పేరును 24వ వార్డు కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్ ప్రతిపాదించగా, 23వ వార్డు కౌన్సిలర్ బానేశ్ బలపరిచాడు. ఈ నిర్ణయానికి కౌన్సిలర్లందరూ ఆమోదం పలికారు. రెండు పదవులకు ఒక్కొక్కరి పేరునే ప్రతిపాదించడం, మిగతా కౌన్సిలర్లంతా ఆమోదం పలకడంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఆర్డీవో రాములు ప్రకటించారు. అనంతరం చైర్మన్ ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ సల్ల మహేశ్‌తో ప్రమాణస్వీకారాన్ని చేయించారు. ఎన్నిక ప్రక్రియ పూర్తయిన తర్వాత చైర్మన్ చాంబర్‌కు వెళ్లిన చైర్మన్, వైస్‌చైర్మన్‌లు ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, వైస్‌చైర్మన్‌లకు మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే సమక్షంలో బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్లు

నాగోబాకు మహాపూజ

అర్ధరాత్రి నిర్వహించిన మెస్రం వంశీయులు

కోనేరు నుంచి పూజల కోసం నీటిని తీసుకొస్తున్న మహిళలు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 9: ఇంద్రవెల్లి మండ లంలోని కెస్లాపూర్‌లో తమ ఆరాధ్య దైవమైన నాగోబాకు మెస్రం వంశీయులు శుక్రవారం అర్ధరాత్రి మహాపూజలు నిర్వహించారు. దీంతో నాగోబా జాతర వైభవంగా ప్రారంభ మైంది. శుక్రవారం ఉదయం 11గంటల నుంచి రాత్రి 12గంటల వరకు సంప్రదాయ ప్రత్యేక పూజలు అద్భుతంగా సాగాయి. ఈనెల 15వ తేదీ వరకు జాతర కొనసాగుతుందని నాగోబా ఈవో రాజమౌళి తెలిపారు.

ప్రత్యేక పూజలు..

గంగాజలంతో ఐదు రోజులుగా మర్రిచెట్ల వద్ద బసచేసిన మెస్రం వంశీయులు ముందుగా అక్కడే సంప్రదాయ పూజలు చేశారు. అనం తరం కెస్లాపూర్‌లోని పురాతన(మురాడి)నా గోబా ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురాతన నాగోబా విగ్రహం తోపాటు వెలిగించిన దీపాలను వెదురుబు ట్టలో పెట్టి శోభాయాత్రగా నాగోబా ఆలయా నికి చేరుకున్నారు. మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. పురాతన నాగోబా విగ్రహాల తోపాటు నాగోబాదేవత, సతీదేవత, బాన్‌దేవ తకు సంప్రదాయ పూజలు చేశారు. పురాతన నాగోబా విగ్రహాన్ని గర్భగుడిలోని నాగోబా విగ్రహం వద్ద ఉంచారు. బాన్‌దేవతలతోపాటు పెర్సపేన్ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వ హించి తిరిగి నాగోబా ఆలయంలోకి వచ్చారు.

గోవాడ్‌లో మహిళలకు ప్రవేశం....

మర్రిచెట్ల నుంచి మెస్రం వంశీయులు ఎడ్ల బండ్లతో కుటుంబ సమేతంగా సంప్రదాయ ప్రకారం నాగోబా ఆలయానికి చేరుకొని, మహిళలకు గోవాడ్‌లో ప్రవేశం కల్పించారు. గోవాడ్ చుట్టూ తమ ఎడ్లబండ్లను వదిలి ప్రత్యేక గుడారాలు ఏర్పాటు చేసుకొని బసచే స్తున్నారు. గోవాడ్‌లో ప్రవేశించిన మహిళలు 22 ప్రత్యేక పొయ్యిలను ఏర్పాటు చేసుకొని మహాపూజలకు అవసరమైన నైవేద్యాన్ని సామూహికంగా తయారు చేస్తున్నారు. మహా పూజలకు అరగంటముందు నాగోబా ఆల యాన్ని గంగాజలంతో శుద్ధి చేశారు. రాత్రి 10 గంటల తర్వాత మెస్రం వంశీయులు గోవాడ్ నుంచి వెలిగించిన కాగడాలను చేతిలో పట్టు కొని నాగోబా ఆలయానికి చేరుకున్నారు.

ఆలయానికి వస్తున్న మెస్రం వంశీయులు

22 కితలకు మట్టికుండల పంపిణీ....

నాగోబా ఆలయం వెనుక ఉంచిన మట్టికుం డలను 22కితలకు చెందిన మహిళలకు మెస్రం వంశీయుల పెద్దల చేతుల మీదుగా పంపిణీ చేశారు. మహాపూజలకు ఉపయోగించుకునే మట్టికుండలకు కటోడ కోసేరావ్, కోసు కటోడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీటితో మహి ళలు మర్రిచెట్లవద్ద ఉన్న పురాతన బావి(నీటి కోనేరు)కు చేరుకున్నారు. మెస్రం వంశీయుల అల్లుళ్లు నీటి కోనేరు ద్వారా నీటిని తోడి మట్టి కుండల్లో నింపారు. ఆ కుండలను మహిళలు తలపై పెట్టుకొని వరుసగా నాగోబా ఆలయా నికి చేరుకున్నారు. పాత పాముల పుట్టలను అల్లుళ్లు తవ్వి తొలగించారు. అదే మట్టిను మహిళలు తెచ్చిన నీటితో అల్లుళ్లు బురదమట్టి చేసిచ్చారు. మహిళలందరూ కలిసి ఆ మట్టితో పాముల పుట్టలను తయారు చేశారు. అదే మట్టితో మరికొంత మహిళలు ఆలయంలో బౌలదేవతను తయారు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.